క్లుప్తంగా

ఎస్ఐ, కానిస్టేబుల్‌కు సన్మానం



జబీనాబేగం, ఆఫ్రీన్ బేగంలను సన్మానిస్తున్న కృష్ణముదిరాజ్ తదితరులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన జబీనాబేగం ఎస్ఐగా, ఆఫ్రీన్ బేగం కానిస్టేబుల్‌గా రెండు సంవత్సరాల క్రితం ఎంపికయ్యారు. వారిరువురు గ్రామంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు శనివారం హాజరుకావడంతో వారిని చౌడాపూర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు ఎందులోనూ తక్కువకాదని నిరూపించారన్నారు. విధి నిర్వహణలో గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వంద రోజులు పూర్తికాని వారికి పనులు

ధారూరు: ధారూరు గ్రామ పంచాయతి పరిధిలోని గ్రామాల్లో 2024, ఏప్రిల్ నుంచి, 2025, మార్చి 31 వరకు 100 రోజులు పూర్తి కానీ వారికి సోమవారం నుంచి ఉపాధిహామీ పనులు కల్పించనున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మరి భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. వంద రోజుల పని పూర్తి కాని కూలీలు గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫారంపండ్స్, సరిహద్దు కందకాలు, పశువుల షెడ్లు, భూమి చదును చేయుట, ఫారేష్టన్ రోడ్లు, కాల్వల మళ్లింపు, పండ్ల తోటల పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ఘటనపల్లి గ్రామ పరిధిలో కానెమోని చెన్నయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు కురుంపల్లి నర్సింలు గౌడ్ బాధిత కుటుంబీకుల ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామ పరిధిలోని నిరుపేద బడుగుబలహీనవర్గాల ప్రజలకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాల్‌రెడ్డి, చిన్న వెంకటయ్య, గాదె మొగులయ్య, రేణి చిన్నరాములు, రేణివెంకటయ్య, పినమోని నరేష్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

మర్పల్లి: మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు మర్పల్లి మండలానికి చెందిన రామేశ్వర్ యువసేన కార్యవర్గ సభ్యులు ఓఆర్ఎస్ ప్యాకెట్లను శనివారం మధ్యాహ్నం పని ప్రదేశంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువసేన నాయకులు లింగం, రవి నాగేశ్, శ్రీకాంత్ మజార్ మాట్లాడారు. వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలు పని చేసే సమయంలో దాహం వేస్తే తాగేనీటిలో టాటా గ్లూకోజ్, ఓఆర్ఎస్ కలుపుకొని తాగితే కొంత మేర ఉపశమనం ఉంటుందన్నారు. తన సొంత డబ్బులు వెచ్చించి 130 మంది కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశానన్నారు.

మండలంలో సామాజిక తనిఖీ



ఉపాధి హామీ సామాజిక తనిఖీలో అధికారులు

అనంతగిరి: వికారాబాద్ మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులు 2023–24 సంవత్సరానికి సంబంధించిన మండల స్థాయి సామాజిక తనిఖీని శనివారం ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. మండలంలోని జరిగిన ఆయా గ్రామ స్థాయి ఉపాధి హామీ పనుల ఆడిట్ వివరాలను సభలో చర్చించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉన్న పలు చిన్న చిన్న తప్పిదాలను మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాలని డీఆర్‌డీఓ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఉపాధిహామీ జిల్లా అంబుడ్స్‌మెన్ రాములు, ఎంపీఓ దయానంద్, ఏపీఓ శీను, ఈసీ నవీన్‌కుమార్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భరోసా.. అరకొర!



దౌల్తాబాద్ ఏఈఓ కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు (ఫైల్)

కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తున్న రైతు భరోసా అభాసు పాలవుతోంది. ఎకరాకు రూ.12 వేలు, రెండు విడతల్లో మొదట రూ.6 వేలు, రెండో విడత మరో రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమచేయాలి. కానీ ఎకరా ఉన్న రైతులకు కూడా నేటికి జమకాలేదు. కొందరికి రూ.3 వేలు జమ అయ్యాయని, మరికొందరికి అవి కూడా కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొందరికి అసలే రాలేదు. ఈ విషయం గురించి లబ్ధిదారులు అటు బ్యాంకర్లు, ఇటు వ్యవసాయ అధికారులను అడిగినా... తమకేం తెలియదనే సమాధానాలు వస్తున్నాయని చెబుతున్నారు.

- పూర్తిస్థాయిలో జమకాని నగదు
- ఆందోళనలో లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం గందరగోళంగా మారింది. గత ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున ఏడాదిలో రెండు విడతలుగా అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పేరుతో ఏడాదికి రూ.12వేలు అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. వారం రోజులుగా మొదటి రెండు విడతలు అంటూ ప్రచారం జరుగుతోంది. మొదటి విడత రూ.6 వేల చొప్పున జమచేయాలి. కానీ ఉన్నవారికి కూడా రూ. 6వేల కంటే తక్కువగా డబ్బులు జమ అవుతుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. భూమి ఉన్న దానికంటే తక్కువ జమ చేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంత మందికి ఎకర ఉన్నప్పటికి నేటికీ జమ కాలేదంటున్నారు. రెండు, మూడు ఎకరాలు ఉన్న రైతుల ఖాతాల్లో అరకొరే జమ అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. పంట భూమికి మొత్తంగా రైతు భరోసా జమ చేయాలని కోరుతున్నారు.

స్పష్టత ఇవ్వని అధికారులు

మండలంలో చాలా మంది రైతులకు రైతు భరోసా డబ్బులు జమ కావడం లేదు. దీనికి సంబంధించిన వివరాలు స్పష్టంగా తెలియడం లేదని రైతులు అయోమయానికి గురవుతున్నారు. భూమికంటే తక్కువ జమ కావడంతో రైతులు వ్యవసాయ అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని చెబుతున్నారు. వ్యవసాయ శాఖ పోర్టల్‌లో సమస్య ఉందని కొందరు అధికారులు చెబుతున్నారు. ఐనప్పటికీ ఎంతమందికి ఎంత జమఅయ్యాయనే స్పష్టత తమకే తెలియదని కొందరు వాపోతున్నారు. బ్యాంకర్లను అడిగితే ఈ విషయాలను తమను అడగొద్దని రైతులకు బదులిస్తున్నారు. దీంతో రైతులు రైతుభరోసా కోసం నాలుగైదు రోజులుగా వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు.

“ రూ.3 వేలు జమయ్యాయి



నా పేరు చిన్న అంతయ్య. గ్రామం నీటూరు. నాకు ఎకరా పొలం ఉంది. అయితే ఈ సారి రైతు భరోసా డబ్బులు కేవలం రూ.3 వేలు మాత్రమే జమ అయ్యాయి. ఇదేంటని ఏఈఓను ప్రశ్నిస్తే చాలా మందికి అలాగే జమ అవుతున్నాయని సమాధానమిచ్చారు.

– చిన్న అంతయ్య, నీటూరు

డబ్బులు ఖాతాలో జమకాలేదు



పేరు కుర్మని నర్సప్ప, గ్రామం దౌల్తాబాద్. నాకున్న 1.10ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటున్నాను. రైతుభరోసా వస్తే పెట్టుబడికి ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం రైతు భరోసా డబ్బులు ఖాతాలో జమ కాలేదు. నాలుగు రోజులుగా స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్దకు వచ్చి వెళ్తున్నాను. దీని గురించి సంబంధిత అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదు.

– కుర్మని నర్సప్ప, దౌల్తాబాద్

బాధిత రైతులకు న్యాయం చేయాలి

పీఎస్‌పీఎస్ సంఘు వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్



మాట్లాడుతున్న రాఘవేందర్ గౌడ్

కుల్కచర్ల: అన్యాయానికి గురైన బాధిత రైతులకు న్యాయం చేయాలని పీఎస్‌పీఎస్ సంఘు వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం బాధితులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తతరహా మోసాలతో రైతులకు అన్యాయం చేసిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టాపాసుపుస్తకాలపై లోన్లు ఉన్నప్పటికీ స్థానిక తహసీల్దార్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభం చేకూర్చేవిధంగా నిబంధనలను ఉల్లంఘించి రిజిస్ట్రేషన్ చేయడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కొంతకాలంగా తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి ఎక్కువగా జరుగుతుందని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, లక్ష్మణ్, కావలి లక్ష్మయ్య, కావలి పాండు, శ్రీనివాస్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బంజారా భవనానికి స్థలం కేటాయించాలని వినతి



స్థలం కేటాయించాలని తహసీల్దార్ మునీరొద్దీన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బంజారా నాయకులు

మర్పల్లి: మర్పల్లి మండల కేంద్రంలో శనివారం సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను బంజారా నాయకులు ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బంజారా నాయకులు, యువకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం మండల కేంద్రంలో బంజారా భవనానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ మునిరొద్దీన్‌కు జెడ్పీటీసీ మాజీ సభ్యులు మధుకర్‌తో కలిసి బంజారా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీల కతీతంగా పలువురు బంజారా నాయకులు మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ విగ్రహ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ మండల కేంద్రంలో బంజారా భవనానికి స్థలం కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బంజారా నాయకులు మర్పల్లి మాజీ సర్పంచ్ పాండునాయక్, మండల నాయకులు సంతు, గోపాల్, రాంచందర్, షెట్టి, పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీఎంఆర్‌ను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్లు

ఎమ్మెల్యే బీఎంఆర్‌కు కృతజ్ఞతలు

తాండూరు: వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీ పాలక వర్గాల పదవీకాలాన్ని పెంచడంలో విశేష కృషి చేసిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని టీఎస్‌సీఏబీ చైర్మన్ రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల పదవీకాలం 15వ తేదీతో ముగిసిందన్నారు. ఈ విషయంలో పదవీకాలాన్ని పొడగించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే బీఎంఆర్ చొరవతో వారి పదవీకాలం మరో 6 నెలలు పొడిగించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏసీఎస్, డీసీసీబీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రైతులకు మరింత సహకారం అందించాలని ఆయన సూచించారు.

మురుగు కాల్వ నిర్మించాలని వినతి

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కరన్‌కోట్ వాసులు
- పట్టించుకోని అధికారులు



నడిమింటి నర్సయ్యగౌడ్ ఓపెన్ ప్లాట్‌లో నిలిచిన మురుగునీటిని చూపిస్తున్న స్థానికులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కరన్‌కోట్ గ్రామంలోని సీసీఐ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న కాలనీలో మురుగు ప్రవహిస్తోంది. జయశంకర్ కాలనీ నుంచి వేంకటేశ్వర దేవాలయానికి వెళ్లేమార్గంలో మురుగు నడిమింటి నర్సయ్యగౌడ్ ఓపెన్ ప్లాట్‌లోకి చేరుతుందన్నారు. మురుగు కాల్వ లేకపోవడంతో గుంతల్లో చేరి దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడే హోటల్ నడుపుకుంటున్న నిర్మళ సమీపంలో మురుగు చేరడంతో కస్టమర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి కాల్వ నిర్మించేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

షాబాద్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కోటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్, నరేడ్లగూడ, నాగర్‌కుంట, మాచన్‌పల్లి, పోలారం, గోపిగడ్డ, సంకేపల్లిగూడ, మల్లారెడ్డిగూడ, కేశవగూడ, ముద్దెంగూడ, చర్లగూడ, అస్పల్లిగూడ, ఎల్గొండగూడ, మరియాపూర్ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ పేర్కొన్నారు.

నూతన విద్యాధికారులకు ఘన సన్మానం



దూస రాములును సన్మానిస్తున్న తపస్ నాయకులు



రమేష్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నేతలు

బషీరాబాద్: మండల విద్యాధికారిగా మంతట్టి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూస రాములు నియమితులయ్యారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో బషీరాబాద్, యాలాల మండలాలకు ఎంఈఓగా పనిచేసిన సుధాకర్‌రెడ్డి జనవరి 31న ఉద్యోగ విరమణ చేయడంతో రెండు మండలాల్లో ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 6మందిని ఎంఈఓలుగా నియమించడంతో బషీరాబాద్, యాలాల మండలాలకు వేరువేరుగా పూర్తిస్థాయి ఇంచార్జి పోస్టులు భర్తీ అయ్యాయి. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఎంఈఓ దూస రాములు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సహకారంతో మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తానన్నారు.

ఉపాధ్యాయ సంఘాల శుభాకాంక్షలు

నూతన ఎంఈఓగా నియమితులైన దూస రాములును మండలంలోని టీఎస్ పీఆర్టీయూ, టీఎస్ యూటీఎఫ్, తపస్ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువకప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

యాలాల ఎంఈఓగా రమేశ్

యాలాల: మండల విద్యాధికారిగా జుంటుపల్లి జీహెచ్ఎం దరిమీది రమేష్‌ను నియమిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహించిన సుధాకర్‌రెడ్డి జనవరి 31న ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో మండల నోడల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రమేశ్‌ను పూర్తి స్థాయి ఎంఈఓగా నియమించారు.

నూతన ఎంఈఓకు సన్మానం

యాలాల మండల నూతన ఎంఈఓగా బాధ్యతలు తీసుకోనున్న రమేశ్‌ను శనివారం సాయంత్రం పీఆర్టీయూ యాలాల మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిష్టారెడ్డి, రాములు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, జిల్లా బాధ్యులు మొగులయ్య, ప్రభాకర్‌చారి, యాదయ్యగౌడ్, పరమేష్, మురహరినాథ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పల్లకీ సేవ

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి పల్లకీసేవకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్య, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



బొంరాస్‌పేట: జానకంపల్లి పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని జానకంపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు ఎంఈఓగా రిషిప్‌యాదవ్, హెచ్ఎంగా పల్లవి, ఉపాధ్యాయులుగా మౌనిక, అక్షర, శ్రీవర్షిణి, శివకుమార్, అరవింద్ ఒకరోజు విధులు నిర్వహించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సల్మాబేగం, ఉపాధ్యాయిని పూజ, అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీల, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి

నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, ఆయా తండాల్లో గిరిజన నాయకులు సేవాలాల్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, గిరిజన నాయకులు మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని, వారిని ఒక తాటిపై తీసుకువచ్చిన గొప్ప గురువు అన్నారు. అహింసా సిద్ధాంతానికి పునాది వేసిన గొప్ప యోగి అని తెలిపారు. గిరిజనులకు విద్యా, వైద్యం అందించి వారి పాలిట దైవంగా మారి కొత్త జీవితాన్ని ప్రసాదించారని పలువురు పేర్కొన్నారు. లంబాడీలను చైతన్యం చేసి వారిలో జ్ఞానజ్యోతిని వెలిగించిన మహాత్ముడు సేవాలాల్ అని కొనియాడారు.



ధారూరు: రాంపూర్‌తండాలో..



తాండూరు: సేవాలాల్ జయంతిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు



బొంరాస్‌పేట: బంజారాలతో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



కుల్కచర్ల: మక్తవెంకటాపూర్‌లో సేవాలాల్ ఆలయ ప్రారంభోత్సవంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



దోమ: దిర్సంపల్లి తండాలో జయంతిలో బహుజన్ ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు పాత్లవత్ గట్యానాయక్ తదితరులు



పరిగి: జయంతి వేడుకలో మాజీ ఎంపీపీ అరవింద్‌రావు



తాండూరు: జయంతి వేడుకలో బీజేపీ నాయకులు



దుద్యాల్‌లో నృత్యాలు చేస్తున్న గిరిజనులు



బంట్వారం: కోట్‌పల్లిలో సేవాలాల్ జయంతి



బొంరాస్‌పేట: ఊరేగింపులో గిరిజన నాయకులు